జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
మంగళవారం
01-09-2026
సంపుటి 1 సంచిక 280
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



## గణేష్ వేడుకలు.. ‘చిరు’ చెప్పినట్టు చేద్దామా!.

4లో

## కేబినెట్‌లోకి మహేశ్ గౌడ్?

**సెప్టెంబర్ 3న ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్‌తో కీలక సమావేశం**

**సురేఖపై చర్యలతో పాటు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చర్చ!**



**దశ, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్‌లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. సెప్టెంబర్ 3న ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ అధిష్ఠానంతో సమావేశం కానున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ భేటీలో మంత్రి కొండా సురేఖ వ్యవహారంతో పాటు కేబినెట్ విస్తరణ, శాఖల మార్పులపై

..మిగతా 4వ పేజీలో →



## మూసారాంబాగ్
# హైలెవల్ బ్రిడ్జి ప్రారంభం

### రూ.52 కోట్లతో 400 మీటర్ల హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం

**వరదలను తట్టుకునేలా నిర్మాణం.. అంబర్‌పేటకు మెరుగైన కనెక్టివిటీ**

**బీఆర్ఎస్ పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు**

**దశ, హైదరాబాద్:** నగరంలో మరో కీలక మౌలిక వసతి అందుబాటులోకి వచ్చింది. మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. సుమారు రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవున నిర్మించిన ఈ వంతెనతో అంబర్‌పేట, మూసారాంబాగ్ పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. మూసీకి భారీగా వరద వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా వంతెనను పటిష్ఠంగా నిర్మించినట్లు అధికారులు తెలిపారు. వంతెన ప్రారంభం అనంతరం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో వరదల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ వంతెన ఎందుకు నిర్మించలేదని సీఎం ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే బ్రిడ్జి నిర్మాణాన్ని

..మిగతా 4వ పేజీలో →

# ఓల్డ్ సిటీలో మెట్రో అడుగులు..

## వేగం పెంచిన అధికారులు



**888 ప్రభావిత ఆస్తుల్లో 833 స్వాధీనం**

**దారుషిఫా-చాంద్రాయణ గుట్ట మార్గంలో పనుల పరిశీలన**

**మిగిలిన 55 ఆస్తులపై ప్రత్యేక దృష్టి**

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ పాతనగర మెట్రో విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. దారుషిఫా నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను HMRL, HAML అదనపు ఎండీ బి.అజిత్‌రెడ్డి పరిశీలించారు. ఈ మార్గంలో మొత్తం 888 ప్రభావిత ఆస్తులను గుర్తించగా.. ఇప్పటివరకు 833 ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన 55 ఆస్తుల్లో వారసత్వ, పురాతన భవనాలు ఉండటంతో వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. విద్యుత్, నీటి పైపులైన్లు తదితర యుటిలిటీల తరలింపుతో పాటు ఆస్తుల తొలగింపును వేగవంతం చేసి త్వరగా రైట్ ఆఫ్ వే అందుబాటులోకి తీసుకురావాలని అజిత్‌రెడ్డి ఆదేశించారు. పాతనగరం మెట్రో పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా అందించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## కాంగ్రెస్ ‘420 మోసాలపై’
# బీఆర్ఎస్ పోరుబాట!

**ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**

**రేపటి నుంచి వారం రోజుల పాటు నిరసనలు**

**ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



**దశ, రంగారెడ్డి, ఆగస్టు 31:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ‘కాంగ్రెస్ 420 మోసాలపై పోరుబాట’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. రేపటి నుంచి

..మిగతా 4వ పేజీలో →



### హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన
# స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా–2026

4లో

**హైటెక్స్‌లో రెండు రోజుల క్రీడా ఉత్సవం**

**50కి పైగా ఎగ్జిబిటర్లు.. లైవ్ స్పోర్ట్స్ పోటీలు**

**స్పోర్ట్స్, ఫిట్‌నెస్, న్యూట్రిషన్, వెల్‌నెస్‌కు వేదిక**

# నిమ్మ ధరలు.. పైపైకి!



**డజను రూ.120.. వినియోగదారులకు షాక్**

**తగ్గిన దిగుబడులు.. పెరిగిన డిమాండ్‌తో ధరలకు రెక్కలు**

**ఇప్పటికే పెరిగిన నిత్యావసరాల ధరలతో ప్రజలపై అదనపు భారం**

**దశ, హైదరాబాద్ :** నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు నిమ్మకాయ ధరలు మరింత షాక్ ఇస్తున్నాయి. గత నాలుగైదు రోజులుగా నిమ్మ ధరలు ఒక్కసారిగా పెరిగి డజను రూ.120కు చేరాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడులు తగ్గడం, మార్కెట్లో డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఏప్రిల్, మేలో డజను రూ.100 వరకు ఉన్న ధరలు.. జూన్, జూలైలో రూ.30-40కి తగ్గాయి. తాజాగా మళ్లీ రూ.120కు చేరడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పెరిగిన ఉల్లి, చక్కెర, ఇతర నిత్యావసరాల ధరలకు తోడు నిమ్మ ధరలు కూడా పెరగడంతో సామాన్యులపై భారం మరింత పెరిగింది.

## కౌశిక్‌పై వేటు తప్పదా?

**ఎథిక్స్ కమిటీ విచారణతో హుజూరాబాద్‌పై ఉత్కంఠ**

**చర్యలు కఠినంగా ఉంటే ఉప ఎన్నికకు అవకాశం..**

**బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు అగ్నిపరీక్షగా మారే ఛాన్స్!**

4లో



## ఫ్యూచర్ సిటీలో
# భారీ క్రికెట్ స్టేడియం!

**100 ఎకరాల్లో మైదానం.. 1.32 లక్షల సీట్ల ప్రతిపాదన**

**అహ్మదాబాద్ స్టేడియంతో పోటీ పడేలా ప్రణాళికలు**

**డిసెంబర్‌లో శంకుస్థాపనకు అవకాశం?**

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ క్రీడా రంగంలో మరో భారీ ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్ల సమీపంలోని భారత్ ఫ్యూచర్ సిటీలో సుమారు 100 ఎకరాల్లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్టేడియంలో 1.32 లక్షలకు పైగా ప్రేక్షకుల సామర్థ్యం ఉండేలా ప్రతిపాదించినట్లు

..మిగతా 4వ పేజీలో →

# రూ.40 కోట్ల టెండర్‌కు రూ.2.5 కోట్ల ‘అమ్యామ్యాలు’?

**వాట్సాప్ కాల్స్‌తో వ్యవహారం చక్కబెట్టారనే ఆరోపణలు**

**ప్రభుత్వం మారినా.. టెండర్ మాత్రం అదే సంస్థకేనా?**

**మహిళా ఐఏఎస్ అధికారిపై తీవ్ర ఆరోపణలు.. విచారణకు డిమాండ్**




**దశ, హైదరాబాద్:** ఓ కీలక శాఖలో రూ.40 కోట్ల విలువైన టెండర్‌ను ఓ సంస్థకు కట్టబెట్టేందుకు మహిళా ఐఏఎస్ అధికారి రూ.2.5 కోట్ల ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. రెండు విడతల్లో నగదు రూపంలో ఈ మొత్తాన్ని చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ధ్రువీకరణ కావాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో కీలక పదవిలో ఉన్న సదరు అధికారి.. ప్రస్తుతం

..మిగతా 4వ పేజీలో →





# మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి ప్రారంభం

**మొదటి పేజీ తరువాయి**

పూర్తి చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల సమస్యలను పట్టించుకోలేదని విమర్శిస్తూ.. పేదల కోసం తమ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. బతుకమ్మకుంట ఆక్రమణలను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. చెరువులు, కుంటలను కాపాడటంలో భాగంగానే ఆక్రమణలను తొలగిస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ.. గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసిందని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం నెలకు వేల కోట్ల రూపాయలను అసలు, వడ్డీ రూపంలో చెల్లిస్తోందన్నారు. రెండేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని తెలిపారు. రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, శ్రీగణేశ్, నవీన్‌యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీ తదితరులు పాల్గొన్నారు.

# ..బీఆర్ఎస్ పోరుబాట!

**మొదటి పేజీ తరువాయి**



వారం రోజుల పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శేరిగూడలో సోమవారం జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిందని, కానీ ప్రభుత్వం ఏర్పడి చాలా కాలం గడిచినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటిని విస్మరించిందని ఆరోపించారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్, వికలాంగులకు రూ.6 వేల పింఛన్, రైతుబంధు కింద ఎకరాకు రూ.15 వేలు, విద్యార్థినులకు స్కూటీలు, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, కౌలు రైతులకు రూ.12 వేలు, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని మంచిరెడ్డి ఆరోపించారు. యువత, విద్యార్థులు, రైతులు, మహిళలు, ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు సహా అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. స్థానిక సమస్యలతో పాటు ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు వారం రోజుల పాటు నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'పోరుబాట'ను విజయవంతం చేయాలని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి , జిల్లా రైతుబంధు మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి , సీనియర్ నాయకులు జక్క రాంరెడ్డి , మున్సిపల్ ఛైర్మెన్ టేకుల సుదర్శన్ రెడ్డి , మాజీ ఎంపిపి కృపేష్ , ఏర్పుల చంద్రయ్య , బూడిద రాంరెడ్డి , మండల పార్టీ అధ్యక్షులు కొత్త కిషన్ గౌడ్ , చిలుకల బుగ్గరాములు , మున్సిపల్ అధ్యక్షులు అల్వాల వెంకట్ రెడ్డి , కొప్పు జంగయ్య , ఈదమ్మల బలరాం , కళ్యాణ్ నాయక్ , చిన్నయ్య , గౌతంరెడ్డి , చక్రవర్తి గౌడ్ , మొద్దు అంజిరెడ్డి , పాశ్చ బాష , భాస్కర్ రెడ్డి , కోట వెంకట్ రెడ్డి , కాయితి మోహన్ రెడ్డి , నీలం శ్వేత , సుభానీ , సుల్తాన్ , మల్లేష్ యాదవ్ , జెర్కోని రాజు , భరత్ రెడ్డి , జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# కౌశిక్‌రెడ్డిపై వేటు తప్పదా?

**ఎథిక్స్ కమిటీ విచారణతో హుజూరాబాద్‌పై ఉత్కంఠ**

**చర్యలు కఠినంగా ఉంటే ఉప ఎన్నికకు అవకాశం..**

**బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు అగ్నిపరీక్షగా మారే ఛాన్స్!**



**దశ, హైదరాబాద్ :** అసెంబ్లీలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యవహారం మరోసారి రాజకీయంగా హాట్‌టాపిక్‌గా మారింది. కడియం శ్రీహరితో వాగ్వాదం, అనుచిత సైగలు చేశారన్న ఆరోపణలపై స్పీకర్ ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి పంపడంతో.. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న ఉత్కంఠ నెలకొంది. కౌశిక్‌రెడ్డి వివరణ తీసుకుని మందలింపుతో సరిపెడతారా? లేక కఠిన చర్యలకు సిఫారసు చేస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే కమిటీ సిఫారసు చేసిన తర్వాత స్పీకర్, సభ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఇప్పుడే ఆయన ఎమ్మెల్యే పదవిపై వేటు పడుతుందని చెప్పలేని పరిస్థితి ఉంది. ఒకవేళ కఠిన చర్యలతో హుజూరాబాద్ ఎమ్మెల్యే స్థానం ఖాళీ అయితే ఉప ఎన్నిక అనివార్యమయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మరోసారి బలాబలాల పరీక్షగా మారనుంది. బీఆర్ఎస్ ఇప్పటికే ఎథిక్స్ కమిటీ అంశాన్ని రాజకీయంగా ఎదుర్కొంటోంది. కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపిస్తోంది. ఎథిక్స్ కమిటీ దగ్గరే ఎపిసోడ్ ముగుస్తుందా? లేక హుజూరాబాద్ ఉప ఎన్నికకు దారితీస్తుందా? అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చగా మారింది




# రూ.40 కోట్ల టెండర్‌కు రూ.2.5 కోట్ల 'అమ్యామ్యాలు'?

**మొదటి పేజీ తరువాయి**

కూడా అదే శాఖలో కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం మారినా, పాలన మారినా సదరు సంస్థకే కాంట్రాక్టులు దక్కేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారి, సంస్థ నిర్వాహకుల మధ్య వ్యవహారాలను ఓ అధికారి సమన్వయం చేస్తున్నారనే ప్రచారం కూడా ఉంది.టెండర్ ప్రక్రియలో నిబంధనలను పక్కనపెట్టి ఒకే సంస్థకు ప్రయోజనం కలిగేలా నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలు మరింత చర్చకు దారితీశాయి. అంతేకాకుండా ఈ వ్యవహారాలన్నీ వాట్సాప్ కాల్స్ ద్వారా కొనసాగించారని కూడా ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారినప్పటికీ సదరు అధికారిపై బదిలీ వేటు పడకపోవడం, అదే శాఖలో కీలక బాధ్యతలు కొనసాగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అయితే ఇవన్నీ ప్రస్తుతం ఆరోపణలు, ప్రచారంలో ఉన్న వివరాలు మాత్రమే. సంబంధిత అధికారులు, సంస్థ ప్రతినిధుల అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# గణేష్ వేడుకలు.. 'చిరు' చెప్పినట్టు చేద్దామా!



**దశ, హైదరాబాద్ :** పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ రూపొందించిన 'సీడ్ గణపతి' విగ్రహాన్ని చిరంజీవికి అందజేశారు. బంకమట్టిలో విత్తనాలు కలిపి తయారు చేసే ఈ విగ్రహాన్ని నిమజ్జనం చేసిన అనంతరం విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా మారుతాయని తెలిపారు. ఇంట్లోనే సీడ్ గణపతిని తయారు చేసుకుని పూజించాలని చిరంజీవి సూచించారు.

# గుర్తించలేక.. ఖననం

**నేపాల్‌లో మృతదేహాల దయనీయ స్థితి**

**939కి చేరుకున్న మరణాలు**

**ఇంకా లభించని 4,247 మంది ఆచూకీ**

**కాఠ్‌మాండూ:** మృతదేహాలు బయటపడుతున్నాయ్.. కట్టెలు కాలుతున్నాయ్.. సామూహికంగా సమాధి అవుతున్నాయ్.. అవి ఎవరివో.. ఎందుకు నేపాల్ వచ్చారో.. లేదంటే స్థానికంగా ఉంటున్న వారివైనా.. గుర్తించడానికి బంధువులెవరూ మిగిలి లేరో.. కానీ నేపాల్‌లో అత్యంత హృదయవిదారక దృశ్యాలు కలచివేస్తున్నాయి. చిన్న దేశమైన నేపాల్ వనరుల్లేక.. మృతదేహాలను గుర్తించలేక ఇలా సామూహికంగా సమాధి చేస్తోంది. నేపాల్‌లో వరద, బురద విలయం చోటుచేసుకుని వారం సమీపిస్తున్నా విషాద ఛాయలు ఇంకా తొలగిపోవడం లేదు. రోజూ మృతదేహాలు బయటపడుతూనే ఉన్నాయి. ఇంకా వేలమంది ఆచూకీ తెలియడం లేదు. సోమవారం నాటికి మృతి చెందినవారి సంఖ్య 939కి చేరుకుంది. 4,247 మంది జాడ తెలియలేదు. ఇందులో 591 మంది విదేశీయులు, 99మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. టిబెట్‌లో ఇప్పటిదాకా 16 మంది మృతి చెందగా.. 550 మంది ఆచూకీ తెలియడం లేదు. గుర్తు తెలియక..: నేపాల్‌లో వరదకు కొట్టుకొచ్చిన మృతదేహాలను అధికార యంత్రాంగం గుర్తించలేకపోతోంది. చనిపోయి చాలా రోజులు అవుతుండటంతో దొరికిన వెంటనే సామూహికంగా పూడ్చేస్తున్నారు. అయితే వాటిని గుర్తించేందుకు ప్రయత్నించకుండా, హిందూ సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు చేయకుండా ఇలా చేస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు. పరిమితి ఫోరెన్సిక్ సౌకర్యాలే ఉండటంతో మృతదేహాలను గుర్తించడం కష్టంగా మారింది. సహాయక సామగ్రి కొరతతో నేపాల్ ఇబ్బందులు పడుతోంది. మృతదేహాల బ్యాగులు, రోప్‌లు, హెలికాప్టర్లు సరిపడినన్ని లేవు. అత్యధిక మరణాలు సంభవించిన చితవాన్‌లో ఇంకా 250 మృతదేహాలను గుర్తించలేదు.నీ భోటే కోశీ నది నుంచి వందల కిలోమీటర్ల దూరం కొట్టుకువచ్చిన మృతదేహాలు చితవాన్ జిల్లాలో బయటపడుతున్నాయి. శనివారం 100 మృతదేహాలను అధికారులు సామూహిక ఖననం చేశారు. వాహనాల్లో వాటిని అటవీ ప్రాంతానికి తరలించి ఎక్స్‌కావేటర్‌తో గుంతలు తవ్వి పూడ్చిపెడుతున్నారు.

# కేబినెట్‌లోకి మహేశ్ గౌడ్?

**మొదటి పేజీ తరువాయి**

చర్చించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం కేబినెట్‌లో రెండు ఖాళీలు ఉండగా.. పునర్వ్యవస్థీకరణలో భాగంగా మరికొందరిని తప్పించి కొత్తవారికి అవకాశం కల్పించే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉందన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే ఆయనకు మంత్రి పదవి ఇస్తే పీసీసీ అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇప్పటికే ఏఐసీసీకి చేరినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని ఆయన స్పష్టం చేశారు. దీంతో సెప్టెంబర్ 3న జరిగే ఢిల్లీ భేటీపై తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది.

# ఫ్యూచర్ సిటీలో భారీ క్రికెట్ స్టేడియం!

**మొదటి పేజీ తరువాయి**

సమాచారం. ప్రాజెక్టు పూర్తయితే ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా ఉన్న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంతో పోటీ పడే అవకాశం ఉంది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సులభమైన కనెక్టివిటీ ఉండేలా మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది డిసెంబర్‌లో శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నప్పటికీ.. తేదీ, నిర్మాణ సంస్థ, ప్రాజెక్టు షెడ్యూల్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చడం, నిర్మాణంనిర్వహణకు బీసీసీఐ నిధులు సమకూర్చే ప్రతిపాదన ఉన్నట్లు సమాచారం. స్టేడియం అందుబాటులోకి వస్తే హైదరాబాద్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌లు, క్రీడా ఈవెంట్లు పెరగడంతో పాటు స్పోర్ట్స్ టూరిజానికి కూడా ఊతం లభించే అవకాశం ఉంది.

# ఎంఐఎం ఎమ్మెల్సీపై బాలిక పై దురుసు ప్రవర్తన ఆరోపణలు.. వేటు!

## మీర్జా రహమత్ బేగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన అసదుద్దీన్ ఓవైసీ

**ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశాలు**

**ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందిందా? అనే చర్చ**





**దశ, హైదరాబాద్:** ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌పై బాలికతో అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. అత్తాపూర్ ప్రాంతంలో ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ స్పందించినట్లు సమాచారం. బేగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని పార్టీ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి రావడంతోనే పార్టీ చర్యలు తీసుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు, ఆరోపణల వాస్తవాలు అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. ఈ ఘటనపై పలువురు రాజకీయ నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. బేగ్‌పై చర్యలకు దారితీసిన కారణాలను ఎంఐఎం అధినేత బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. కొందరు నేతలు తమ వద్ద ఘటనకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులకు అధికారిక ఫిర్యాదు అందలేదని సమాచారం. ఫిర్యాదు నమోదైతే పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆరోపణల్లో వాస్తవాలను నిర్ధారించే అవకాశం ఉంది. ఎమ్మెల్సీపై పార్టీ చర్యలతో మొదలైన ఈ వ్యవహారం ఇక ఎలాంటి మలుపు తిరుగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైన స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా-2026

**దశ, హైదరాబాద్:** స్పోర్ట్స్, ఫిట్‌నెస్, న్యూట్రిషన్, వెల్‌నెస్ రంగాలకు సంబంధించిన స్పోర్ట్ ఎక్స్‌పో ఇండియా-2026 హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ 9వ ఎడిషన్‌ను హైటెక్స్ డైరెక్టర్ కున శంకర్, ఎన్ఎండీసీ డైరెక్టర్ పర్సనల్ కృష్ణ కుమార్ ఠాకూర్, హైదరాబాద్ రన్నర్స్ రేస్ డైరెక్టర్ రాజేష్ వెట్చా ప్రారంభించారు.ఎక్స్‌పోలో 50కి పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. క్రీడలు, ఫిట్‌నెస్, న్యూట్రిషన్, వెల్‌నెస్‌కు సంబంధించిన ఉత్పత్తులు, సేవలతో పాటు లైవ్ స్పోర్ట్స్ టోర్నమెంట్లు, క్రీడా పోటీలు, డెమోన్స్ట్రేషన్లు, ఇంటరాక్టివ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కున శంకర్ మాట్లాడుతూ.. క్రీడాకారులు, కోచ్‌లు, ఫిట్‌నెస్ ఔత్సాహికులు, బ్రాండ్లు, పరిశ్రమ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఎక్స్‌పో లక్ష్యమన్నారు. హైదరాబాద్ మారథాన్‌కు కర్టెన్ రైజర్‌గా నిర్వహిస్తున్న ఈ ఎక్స్‌పో.. నగరాన్ని క్రీడా, ఫిట్‌నెస్ ఈవెంట్లకు మరింత కీలక వేదికగా నిలబెడుతుందని తెలిపారు.

# ఆర్మీ కంచుకోట మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల అపహరణ!

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఆర్మీ అధీనంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాల దొంగతనం కలకలం రేపింది. గది తాళాన్ని పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు మొత్తం 12 ఆయుధాలను ఎత్తుకెళ్లారు. ఆర్మీ అధికారుల ఫిర్యాదుతో బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. రక్షణ వ్యవహారాలకు సంబంధించిన వ్యవహారం కావడంతో పోలీసులు కేసు వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కంటోన్మెంట్ ప్రాంతంలో రక్షణ దళాల శిక్షణ సంస్థకు చెందిన వివిధ రెజిమెంట్‌లు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఆర్మీ సిబ్బంది ఆయుధాలు భద్రపరిచే విభాగం ఉంది. అనుమతి ఉన్న వ్యక్తులు మినహా ఎవరూ లోనికి వెళ్లలేరు. ఈ విభాగంలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఆర్మీ అధికారులు గుర్తించారు. గది తాళం పగులగొట్టిన ఆగంతకులు నాలుగు ఏకే 47లు, ఆరు పిస్టళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, మందుగుండు సామగ్రి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com